క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మొగల్తూరు: మొగల్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఇంజేటివారిపాలెం, పడమటిపాలెం, శేరేపాలెం, కొత్తపాలెం, నవుడూరుగరువు ప్రాంతాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ బళ్ళ సురేష్ కుమార్ తెలిపారు.

అన్నసమారాధన



కాజ బైపాస్ రోడ్డులో అంతర్వేది వెళ్లే భక్తులకు ఏర్పాటు చేసిన భోజనాలు

యలమంచిలి: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవాలను తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు చించినాడ జాతీయ రహదారి మీదుగా తరలివెళ్లారు. కాజ గొంది బైపాస్ రోడ్డులో ఉన్న వ్యాపారస్తులంతా కలసి దాతల సహకారం తీసుకుని అంతర్వేది వెళ్లే భక్తులకు కాజ గొంది బైపాస్ రోడ్డులో నవకాయ పిండి వంటలతో సుమారు నాలుగు వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలతో వెళ్లే భక్తులకు ఉచితంగా పాలు సరఫరా చేశారు. గొంది సర్పంచ్ మద్దాల శ్రీకృష్ణ ఆంజనేయులు, మేళం రామాంజనేయులు (కాజ బిర్యానీ రాము), కడలి మోహనరావు, సాయి సంపత్ హేచరీ సత్యనారాయణ ఇతర భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.


అభివృద్ధిలో వడలి ముందంజ



వడలిలో మార్కెట్ షెడ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సహకారంతో వడలి గ్రామాన్ని సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ ముందంజలో ఉంచడం అభినందనీయమని పెనుగొండ జెడ్పీటీసీ సభ్యులు పోడూరి గోవర్ధన అన్నారు. వడలిలో రూ.30 లక్షలతో నిర్మించిన మార్కెట్ షెడ్, ఎస్సీ కాలనీలో రూ.12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ ప్రీస్కూలును బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీలు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గా భవాని ప్రసాద్‌లు, వైఎస్సార్ గ్రామ అధ్యక్షుడు బందారు ప్రసాద్, వెంకట్రామపురం సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మీ, నడిపూడి సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, ఏఎంసీ డైరెక్టర్ జుత్తిగ బాలయ్య, బొక్కా దాసు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



రాజమండ్రి ఆసుపత్రిలో మహిళకు ఫించను అందిస్తున్న దేవ వలంటీరు శిరీష

పెనుగొండ: ప్రభుత్వ సేవలు అందించడంలో వలంటీర్లు నిబద్ధతను చాటుకుంటున్నారు. గత కొంతకాలంగా రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్న మండలంలోని దేవ గ్రామానికి చెందిన వితంతు పింఛను లబ్ధిదారురాలు చిట్టితల్లికి ఆ గ్రామ వలంటీరు చిల్లా శిరీష్ బుధవారం రాజమండ్రి వెళ్లి పింఛను సొమ్ము అందించారు. వలంటీర్ శిరీష్‌ను గ్రామ సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ సాకా సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం అభినందించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో పోటీల్లో విజేతలకు బుధవారం శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, స్కూల్ డైరెక్టర్ ఎంఎస్ వాసు, ప్రిన్సిపాల్ సామవేదం వసంతలక్ష్మి, రావాడ సతీష్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎండీఎఫ్ నిధులతో అభివృద్ధి షురూ

- నరసాపురం నియోజకవర్గంలో రూ.1.35 కోట్లతో పలు పనులు
- చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో సొమ్ము విడుదల



నరసాపురంలో అంజుమన్ భవనం

నరసాపురం: నరసాపురంలో వివిధ కమ్యూనిటీ భవనాలు, మంచినీటి పథకాలకు సీఎండీఎఫ్ (చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్స్) నుంచి రూ.1.35 కోట్లు నిధులు మంజూరు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించి జీవో ఎంఎస్ 106, 70లను ప్రభుత్వం ఇచ్చింది. ముఖ్యంగా పట్టణంలో ముస్లిం మైనార్టీకి చెందిన అంజుమన్ భవనం అభివృద్ధికి రూ.25 లక్షలు కేటాయించారు. గత ఏడాది నవంబర్ 21వ తేదీన నరసాపురంలో రూ.3,300 కోట్ల భారీ ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నరసాపురం వచ్చినప్పుడు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పలు అభివృద్ధి పనులకు నిధులు కావాలని సీఎంను కోరడంతో పాటుగా ప్రతిపాదనలు అందించారు. దీంతో పనులకు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల నుంచి సొమ్ము మంజూరు చేశారు.

చేపట్టనున్న పనులు ఇవే..

రూ.25 లక్షలతో 16వ వార్డులోని అంజుమన్ భవనం పైఅంతస్తు అభివృద్ధి చేయడం, 8వ వార్డులో బీసీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి రూ.10 లక్షలు, మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఓహెచ్ఆర్ నిర్మాణాలకు రూ.20 లక్షలు, నరసాపురం పట్టణం 14వ వార్డులో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.39 లక్షలు, వైఎస్ఎం కాలేజ్ పీజీ బ్లాక్ అభివృద్ధికి రూ.12 లక్షలు, కొత్తనవరసపురంలో ఎస్టీలకు సంబంధించి మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.5 లక్షలు, అలాగే పాతనవరసపురం, కొత్తనవరసపురం, మల్లవరం, మల్లవరం లంక గ్రామాల్లో ఎస్సీలకు సంబంధించి మంచినీటి పైప్‌లైన్ల అభివృద్ధి, సీడబ్ల్యూఎస్ స్కీమ్స్‌లో అభివృద్ధి పనులకు రూ.18 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ పనులు మరి కొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతున్నాయి.

అంజుమన్ భవనానికి కొత్తరూపు..

ముస్లిం మైనార్టీలకు చెందిన అంజుమన్ భవనం కొత్తరూపు సంతరించుకోనుంది. ఈ భవనం రెండో అంతస్తు అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేయడంతో మైనార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గత రంజాన్ ప్రార్థనల్లో పాల్గొనడానికి వెళ్లిన చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు అంజుమన్ భవనం అభివృద్ధికి సహకారం అందించాలని ముస్లిం సంఘ పెద్దలు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రసాదరాజు ప్రత్యేక కృషితో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు మంజూరు చేయించారు. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న ముస్లింలు ఫంక్షన్స్ ఈ భవనంలోనే చేసుకుంటారు.

ముదునూరికి ప్రత్యేక కృతజ్ఞతలు



అంజుమన్ భవనం అభివృద్ధికి రూ.25 లక్షలు సీఎండీఎఫ్ ఫండ్స్ కేటాయించడం గొప్పవిషయం. ఈ విషయంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు ముస్లింల అందరి తరపునా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ముఖ్యమంత్రికి కూడా ధన్యవాదాలు. ఈ నిధులతో మా అంజుమన్ భవనాన్ని మరింత సుందరంగా ఆధునికీకరించుకుంటాం.

– షేక్ బులిమస్తాన్, అంజుమన్ సంఘం అధ్యక్షుడు

పనులు వెంటనే ప్రారంభిస్తాం



కమ్యూనిటీ హాల్స్, ముఖ్యమైన శ్మశానవాటికలు, ఇంకా ముఖ్యంగా పలు గ్రామాల్లో మంచి నీటి పైప్‌లైన్లు, ఓహెచ్ఆర్‌ల మరమ్మతులకు ముఖ్యమంత్రిని అడగగానే నిధులు మంజూరుచేశారు. రూ.1.35 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు టెండర్లు పూర్తి చేసి వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



శేరేపాలెంలో పంటబోదె పనులను పరిశీలిస్తున్న పర్యవేక్షణాధికారులు

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం, శేరేపాలెం గ్రామాల్లో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను బుధవారం రాష్ట్ర పర్యవేక్షణాధికారులు ఎం.గౌరీ శంకర్, సి.రవీంద్ర నాథ్‌రెడ్డి పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పంటబోదె పనులను పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో వారు మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని, వేతనాలు సమయానికి అందుతున్నాయో లేదో తరుచుగా పరిశీలించాలన్నారు. చేపట్టిన ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు రికార్డు చేసిన బుక్‌లను పరిశీలించి పలు సూచనలు అందచేశారు. ఈసమావేశంలో ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్, ఏపీవో వై.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు
- వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల అందజేత



నరసాపురం 6వ వార్డులో పింఛను పంపిణీ చేస్తున్న ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం వేకువజామునే పింఛను సొమ్ములను లబ్ధిదారులకు అందించారు. పట్టణంలోని 6వ వార్డులో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో గతంలో పింఛను తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే కానీ కొత్తవారికి పింఛను ఇచ్చే పరిస్థితి ఉండేది కాదని గుర్తు చేశారు. కొత్త పింఛను కోసం టీడీపీ నాయకులు, అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు వలంటీర్ ద్వారా ఇంటికే వెళ్లి అర్హులకు పింఛన్లు రాసి మంజూరు చేస్తున్నామని చెప్పారు. 1వ తేదీనే ఠంచన్‌గా పింఛను అందిస్తున్నామని వివరించారు. ఇక ఈ కొత్త సంవత్సరంలో గత నెల నుంచి పింఛను మొత్తాన్ని మరో రూ.250 పెంచి నెలకు రూ.2750 చొప్పున అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థికభారం పడుతున్నా కూడా లెక్కచేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కావలి నాని, పతివాడ పద్మ, గోరు సత్తిబాబు, గృహసారథి గొర్రెల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పింఛన్ సొమ్ము అందజేత



గీత కార్మికుడు కోటేశ్వరరావుకు కల్లు తీసే ప్రాంతానికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గంగాభవాని

పాలకొల్లు అర్బన్: ప్రస్తుతం కల్లు గీత కార్మికులకు సీజనల్ రోజులు. చెట్టు నుంచి కల్లు కిందకు దింపి మళ్లీ చెట్టుకి కల్లు కుండను కట్టాలి. ఇదంతా సమయానికి కట్టకపోతే కల్లు కుండ నుంచి కల్లు కిందకు వృధాగా పోతుంది. అయితే పింఛన్ అందజేయడానికి పోడూరు మండలం ఎస్ఆర్‌పేటకు చెందిన వలంటీర్ గంగాభవాని బుధవారం ఉదయమే గీత కార్మికుడు కుడిపూడి కోటేశ్వరరావు ఇంటికి వెళ్లింది. అయితే కోటేశ్వరరావు కల్లు తీయడానికి ఉదయం 5 గంటలకే తాడిచెట్ల వద్దకు వెళ్లినట్లు తెలుసుకుని అతను ఉండే ప్రాంతం తెలుసుకుని అక్కడకు వెళ్లి పింఛన్ బయోమెట్రిక్ తీసుకుని వైఎస్సార్ పింఛన్ కానుక నగదు రూ.2,750 కోటేశ్వరరావు చేతిలో పెట్టింది. దీంతో అతని సంతోషానికి అవధులు లేవు. వలంటీర్ గంగాభవాని తనను వెతుక్కుంటూ వచ్చి పింఛన్ అందజేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మోడి గ్రామంలో వృద్ధుడికి పింఛను సొమ్ము అందజేస్తున్న నాయకులు

మొగల్తూరులో 80 శాతం పూర్తి

మొగల్తూరు: మండలంలోని 21 సచివాలయాల పరిధిలో సుమారు 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల తదితర పింఛన్ల లబ్ధిదారులు 10,573 మంది ఉన్నారని, వీరికి ప్రతి నెలా రూ.2,86,26,250 అందిస్తున్నామన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుని కల్యాణం



నరసాపురంలో లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పట్టణంలోని యర్రమిల్లివారి వీధిలో వేంచేసియున్న పురాతనమైన శ్రీయోగా లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ చేసి స్వామివార్లకు పూజలు చేశారు. రాత్రి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపారు. అలయ అర్చకుడు శ్రీనివాసుల శేషాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోచర్ల సత్యకృష్ణ, శిరీషకుమారి దంపతులతో కల్యాణ వేడుకను జరిపించారు. లక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను రథంలో వేంచేపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని ముందుకు లాగారు. కన్నుల పండుగగా జరిగిన ఈ రథోత్సవంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి, స్టీమర్ రోడ్డుమీదుగా సాగిన రథోత్సవం రాత్రికి ఆలయానికి చేరుకుంది.

హెల్మెట్ ధారణతో ప్రమాదాలు దూరం



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



హైవేపై వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్ బాబు

నరసాపురం రూరల్: ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ వినియోగించడం ద్వారా ప్రమాదాల నుంచి బయట పడవచ్చునని డీఎస్పీ రవి మనోహర్‌చారి అన్నారు. రుస్తుంబాదలో జాతీయ రహదారిపై వాహన చోదకులకు బుధవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. 'హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరండి' అనే నినాదంతో కూడిన పోస్టరుతో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మనోహర్‌చారితో పాటు సీఐ వాడపల్లి సురేష్, రూరల్‌ఎస్సై విశ్వనాథ్‌బాబు మాట్లాడుతూ ప్రమాదాల్లో చనిపోయిన వారిలో 66 శాతం మంది ద్విచక్ర వాహనదారులేనని, అలాగే ప్రమాదాల్లో గాయపడిన వారిలో 65 శాతం మంది ద్విచక్రవాననదారులేనని, ప్రమాదాల్లో చనిపోయిన వారిలో 72 శాతం మంది యువకులేనని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిని ఇబ్బందికి గురిచేయాలన్నది మాలక్ష్యం కాదని వాహన చోదకులను సురక్షితంగా ఉంచడమే మాకు ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసాపురం – సీతారాంపురం ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్‌లను తప్పని సరిగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

మొగల్తూరు: వాహనదారులు హెల్మెట్‌లను తప్పనిసరిగా వినియోగించాలని సీఐ సురేష్ బాబు సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా బుధవారం మొగల్తూరు జాతీయ రహదారిపై వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం జాగ్రత్తగా వెళ్లినా అవతల వారు నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వాహనం నడిపేటప్పుడు ప్రమాదం జరిగినా హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత అలవర్చుకోవాలి



పెనుగొండలో విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న వీసీ డాక్టర్ టి.జానకిరామ్

పెనుగొండ: విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను అలవరుచుకోవాలని హార్టీకల్చరల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.జానకిరామ్ అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు అటానమస్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు బంగారు పతాకాలు, 17 మంది విద్యార్థులకు రజత పతకాలు అందించడంతో పాటు మొదటి గ్రాడ్యుయేషన్ సందర్భంగా పట్టాలు అందించారు. విద్యార్థులకు నేడు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేషన్ డే జీవితంలో ఓ ఘట్టమని, ఇంకా బాధ్యతగా అభ్యసించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చదువుతో సామాజిక విలువలు అలవర్చుకోవాలన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాలను, అధ్యాపకులను అభినందించారు. ఆర్‌జేడీ సీహెచ్ కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించడానికి కృషి చేయాలన్నారు. జీవితంలో ముందకు సాగడానికి క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్టేరు వరి పరిశోధన సంస్థ ఏడీఆర్ డాక్టర్ భరతలక్ష్మీ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, అటానమస్ కంట్రోలర్ జి.శ్రీధర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, పెనుగొండ ప్రాంతాలకు సంబంధించి ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. ప్రయాణికులు తమ సమస్యలు అలాగే సూచనలు, సలహాలు మధ్యాహ్నం 3 గంటలు నుంచి 4 గంటలు వరకూ 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధిలో కొలువై ఉన్న శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ పునఃనిర్మాణ మొదటి వార్షికోత్సవంలో భాగంగా పూలపల్లి కృష్ణమాచార్యుల యాజ్ఞీకంలో అడబాల శ్రీనివాసు కుటుంబ సభ్యులు స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు.

వైభవంగా అంజన్న కల్యాణోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని రాజుల్లంక గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం అత్యంత వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ప్రతి రోజు రాత్రి భజన కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల్లో ముదునూరి మాత్రాజు, పద్మ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేగేశ్న సీతారామరాజు, కొక్కిర్లపాటి సూర్యనారాయణరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, ముదునూరి నరసింహరాజు, బుల్లెట్‌రాజు, వేగేశ్న పవన్‌వెంకట కృష్ణంరాజు, లావణ్య, దుర్గరాజు, ఐనంపూడి బాపిరాజు, గొట్టిముక్కల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తెలుగు నాటక రంగాన్ని కాపాడుకోవాలి



రసధుని సాహితీ సభలో రామ్మోహనరావును సన్మానించిన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: కావ్యాలన్నింటిలోనూ నాటక ప్రక్రియ రమ్యమైనదని ప్రధాన వక్త కత్తుల రామ్మోహనరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో రసధుని ఆధ్వర్యంలో 'తెలుగు నాటక రంగం.. నాడు – నేడు' స్థితిగతులపై సాహితీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ నాటకం మనిషి జీవన విధానాన్ని, భావోద్వేగాన్ని ప్రతిబింబించే దృశ్యకావ్యమని అన్నారు. నాటకం ప్రజల్ని చైతన్యపరుస్తుందన్నారు. 1860లో మాధురీ మధుకరీయం తొలి తెలుగు నాటకం వచ్చిందన్నారు. కందుకూరి, గురజాడ, కాళ్లకూరి వంటి రచయితలు సందేశాత్మక నాటకాలు రచించారన్నారు. చింతామణి, కన్యాశుల్కం వంటి నాటకాలు నేటికీ ప్రజల్ని చైతన్యవంతులని చేస్తున్నాయన్నారు. సినిమా, టీవీ, సెల్‌ఫోన్‌ల వల్ల నాటక రంగంపై ఆదరణ తగ్గిందని, తెలుగు నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం రామ్మోహనరావును రసధుని ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు, అతిథులు అన్నం నాగభూషణం, వర్ధినీడి నాగేశ్వరరావు, యెరుబండి విజయ భాస్కరమూర్తి, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణమూర్తి, చేగొండి రంగారావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, పి.లక్ష్మీనారాయణ, చల్లా అన్నపూర్ణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు



మట్టపర్రులో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

పోడూరు: జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మట్టపర్రులో బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వెటర్నరీ సిబ్బంది పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం నుంచి 15వ తేదీ వరకు మండల వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల్లోనూ పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నామని చెప్పారు. పెంపుడు జంతువుల ఆరోగ్యంపై యజమానులు తగిన శ్రద్ధ తీసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన పుడు పశువైద్యులకు చూపించి తగిన చికిత్స చేయించాలన్నారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ జయకర్ జాన్సన్, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: భీమవరం బస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.